


మోడీ మోసాన్ని ఎండగట్టేందుకే...


నేడు తిరుపతిలో కాంగ్రెస్ సభ

హోదాపై డిక్లరేషన్ ప్రకటించనున్న వైఎస్ షర్మిల

సిపిఐ, సిపిఎం నేతలు నారాయణ, గపూర్ హాజరు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మోడీ మోసాన్ని ఎండగట్టేందుకు కాంగ్రెస్ ఎన్నికల రెండో సభ తిరుపతిలో నిర్వహించనుంది. తారకరామ స్టేడియం వేదిక కానుంది. పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి సచిన్ పైలెట్, రాష్ట్ర నాయకులు తులసిరెడ్డి హాజరుకానున్నారు. ఈ సభకు సంఘీభావంగా సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు ఎంఎ గఫూర్ హాజరై ప్రసంగించనున్నారు 2014 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష హోదాలో ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్ర మోడీ ఇదే తారకరామ స్టేడియంలో తమను గెలిపిస్తే ఎపికి ఐదేళ్లు కాదు, పదేళ్లు హోదా కల్పిస్తాం అని ఎన్నికల ప్రచార సభలో శ్రీవారి సాక్షిగా ప్రకటించారు. తాము అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదాతో పాటు, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజి, సిఆర్ఎస్ అభివృద్ధి, తిరుపతి రైల్వేస్టేషన్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తానని, కడపకు ఉక్కు పరిశ్రమ తీసుకొస్తామని, చిత్తూరు జిల్లా ఎస్ఆర్‌పురం మండలంలో మిలట్రీ ఆయుధాల తయారీ పరిశ్రమ నెలకొల్పుతామని, మన్నవరంలో భెల్ ఫ్యాక్టరీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అప్పట్లో ఇదే సభలో ఇప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉన్నారు. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అదే వేదికను కాంగ్రెస్ ఎంచుకుని వైఎస్ షర్మిల ఎపికి ప్రత్యేక హోదా డిక్లరేషన్‌ను ప్రకటించనున్నారు. కడప, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి భారీగా కాంగ్రెస్ శ్రేణులు ఈ సమావేశానికి రానున్నాయి ఎఐసిసి కార్యదర్శి గిడుగు రుద్రరాజు, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులుగా సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నగరమంతా కాంగ్రెస్ తోరణాలు, జెండాలతో నింపేశారు. హోదా ఇవ్వకుండా రాష్ట్రాన్ని మోసం చేసిన బిజెపితో అటు అధికార పార్టీ వైసిపి, ఇటు ప్రతిపక్ష పార్టీలు టిడిపి, జనసేనలు అంటకాగడాన్ని ఈ సభ ప్రశ్నించనుంది.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న చింతామోహన్, తులసిరెడ్డి

టిడిపి, వైసిపి, జనసేన..బిజెపికి తొత్తులే : తులసిరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

రాష్ట్రంలో టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు బిజెపికి తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. 2014 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం కొత్తగా ఏర్పడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆర్థికలోటు రానివ్వకుండా రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీలతో మూడు వరాలు ఇచ్చామని గుర్తు చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014 శ్రీవారి సన్నిధి తిరుపతి బహిరంగ సభలో ప్రధానమంత్రి అభ్యర్థిగా ఉన్న నరేంద్ర మోడీ విభజన ఆంధ్ర ప్రదేశ్ కు 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించి అధికారంలోకి రాగానే మోసం చేశారని దుయ్యబట్టారు. ప్రత్యేక హోదా అమలు చేయాలని కోరితే సాకులు వెతుకుతూ బిజెపి చట్టంలో లేదని డొంక తిరుగుడు వ్యవహారం చేస్తోందని, అసలు దేశంలో ప్రత్యేక హోదా 10 రాష్ట్రాలకు కేంద్రం అమలు చేస్తోందని, ప్రత్యేక హోదా అమలుకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ఇస్తే సరిపోతుందని, ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని 2014 మార్చి 1న అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ సంతకం చేశారన్నారు. ప్రత్యేక తరగతి హోదా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్తే ఉపాధి హామీ పథకం నిధులలో 90 శాతం కేంద్రమే భరిస్తుందని 10 శాతం రాష్ట్రం భరించాలన్నారు. అదే ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో నడిచే పథకాలకు పూర్తి నిధులు కేంద్రమే భరించాల్సి ఉంటుందన్నారు. బిజెపి మోసగారితనం, టిడిపి, వైసిపి చేతగానితనం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వెనుకబడి పోయిందన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మహాసభ ప్రత్యేక హోదా డిక్లరేషన్ ఉద్దేశంతో జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నిర్వహిస్తున్న ప్రతి మహాసభకు ఒక ప్రాధాన్యత ఉండేలా నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభకు ఏఐసిసి ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ వస్తున్నారని తిరుపతి, చిత్తూరు, కడప జిల్లాల నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో అధికార ప్రతినిధులు గోవర్ధన్ రెడ్డి, దూది రమేష్, పిసిసి సభ్యులు గోపాల్ రెడ్డి, సిద్దయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, ఓబిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, పుంగనూరు కన్వీనర్ రామకష్ణారెడ్డి, లీల శ్రీనివాస్ పాల్గొన్నారు.



నేటినుంచి ఇంటర్ 'పరీక్షలు'

- 87 కేంద్రాల్లో 62,955 మంది
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం12 వరకు

పరీక్షలంటే భయం వద్దు :ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఐఒ



మార్చి 1 నుంచి 20వ తేది వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలను అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా, మంచి వాతావరణంలో, అన్ని మౌళిక వసతులు కల్పిస్తున్నాం. విద్యార్థులు ఎలాంటి బెరుకులేకుండా పరీక్షలకు హాజరుకావాలి. ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలలు హాల్ టిక్కెట్ ఇవ్వకుండా వేధించినా, ఇబ్బందులకు గురిచేసినా కాల్‌సెంటర్‌కు సమాచారం ఇవ్వాలి. విద్యార్థులు హాల్ టిక్కెట్‌ను నేరుగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడు చేసుకోవచ్చు. ప్రిన్సిపాల్ సంతకం, స్టాంప్ లేకుండా పరీక్షలకు హాజరవ్వచ్చు.

ప్రజాశక్తి-తిరుపతి సిటి

మార్చి ఒకటి నుంచి 20వ తేది వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. జిల్లా వ్యాప్తంగా 87 కేంద్రాల ద్వారా 62,955 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో జూనియర్ ఇంటర్ జనరల్ కోర్సుల్లో 30,440 మంది, ఒకేషనల్ కోర్సుల్లో 1211 మంది, మొత్తం 31,651 మంది, సీనియర్ ఇంటర్ జనరల్ కోర్సుల్లో 30,162 మంది, ఒకేషనల్ కోర్సుల్లో 1242 మంది, మొత్తం 31,404 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, రెండు సిట్టింగ్ స్క్వాడ్‌లు, 1205 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. 87 కేంద్రాల్లోనూ నిరంతరం పరీక్షలపై నిఘా ఉంచేందుకు సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించనున్నారు. పరీక్షలను కన్వీనరు జివి.ప్రబాకర్, డిఈసి-1 ఏ.రఘుపతి, డిఈసి-2 డాక్టరు డి.గోపాల్‌రెడ్డి, డిఈసి-3 ఎ.తులసిరామిరెడ్డి పర్యవేక్షణలో జరుగుతాయి. ఎవ్వరికైనా ఎదైనా సమస్య వచ్చినా, ఇబ్బందులు అనుమానం ఉన్న టోల్‌ఫ్రీ నెంబరు 0877 2237200 నెంబరును సంప్రదించవచ్చును.

ఇంటర్మీడియట్ షెడ్యూల్...

జూనియర్ ఇంటర్

మార్చి 1న సంస్కృతం, 4న ఇంగ్లీష్, 6న మ్యాథ్స్ 1ఏ, బోటనీ, సివిక్స్, 9న మ్యాథ్స్ 1బి, జూయాలజీ, హిస్టరీ, 12న ఫిజిక్స్, ఎకనామిక్స, 14న కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్, 16న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జికోర్సు, మ్యాథ్‌మెటిక్స్ (బైపిసి విద్యార్థులకు), 19న మోడరన్ ల్యాంగ్వేజ్, జియోగ్రఫి పరీక్షలు జరగనున్నాయి.

సీనియర్ ఇంటర్...

మార్చి 2న సంస్కృతం, 5న ఇంగ్లీష్, 7న మ్యాథ్స్ 2ఏ, బోటనీ, సివిక్స్, 11న మ్యాథ్స్ 2బి, జుయాలజీ, హిస్టరీ, 13న పిజిక్స్, ఎకనామిక్స్, 15న కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్, 18న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జికోర్సు, మ్యాథ్‌మెటిక్స్ (బైపిసి విద్యార్థులకు), 20న మోడరన్ ల్యాంగ్వేజ్, జియోగ్రఫీ పరీక్షలు నిర్వహించనున్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలను సక్సెస్ చేద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తిలో ఈనెల మూడో తేదీ నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అన్ని శాఖలు కలిసికట్టుగా విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మి శ పిలుపునిచ్చారు. స్థానిక త్రినేత్ర అతిథి గహంలో కలెక్టర్ గురువారం అన్ని శాఖల అధికారులతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల విజయవంతంపై సమీక్ష, సమన్వయ సమావేశం నిర్వహించారు. గత బ్రహ్మోత్సవాల అనుభవాలను, ఎదుర్కొన్న ఇబ్బందులు గుర్తించి వాటిని అధిగమించి ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. పారిశుధ్యం, తాగునీరుపై దష్టి పెట్టాలని సూచించారు. శాంతిభద్రతలు, బందోబస్తు, భక్తులకు భద్రత, పార్కింగ్, వాహనాల మళ్లింపుపై పోలీస్ శాఖ పటిష్ట ఏర్పాట్లు చేయాలని అన్నారు. బాల్య వివాహాలు జరగకుండా ఐసిడిఎస్, పోలీస్ ప్రత్యేక దష్టి పెట్టాలని అన్నారు. లింగోద్భవం మహాశివరాత్రి కి ప్రత్యేక బందోబస్తు, భద్రత ముఖ్యమని తెలిపారు. మెడికల్ క్యాంపు లు, 108 అందుబాటులో ఉండాలని చెప్పారు. ఆర్టిసి బస్సులు భక్తుల సౌకర్యార్థం సరిపడా ఏర్పాటు చేయాలనీ, వాహనాలకు ఫిట్ నెస్ సర్టిఫికెట్ ఉండాలని సూచించారు. విద్యుత్ అంతరాయం కలగరాదు అన్నారు. కమాండ్ కంట్రోల్



రూమ్ లో అన్ని శాఖల ముఖ్య అధికారులు ఉండాలనీ, అందిన సమాచారానికి సత్వరమే స్పందించి వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫైర్ అధికారులు దేవాలయంలో అన్ని పరికరాలు సర్టిఫై చేయాలి అన్నారు. సెల్ ఫోను సిగ్నల్ లు సరిపడా ఉండేలా, సంబంధిత నెట్వర్క్ ల స్ట్రెంత్ పెంచేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎకో ఫ్రెండ్లీ (పర్యావరణ హితం) పండుగ గా బ్రహ్మోత్సవాలు జరగాలనీ, ప్లాస్టిక్ వాడకం ఉండరాదనీ, ఫ్లెక్సీలు నియంత్రించాలనీ, ప్లాస్టిక్ పై అధికారులు ఎన్ఫోర్స్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్సుల్లో ఒక ఎఎన్ఎం మందులు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలన్నారు. ఎస్పీ మల్లిక గర్గ్, ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, ఆర్డీవో రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

ముందే ముగిసిన పాలకమండలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి పదవీకాలం శుక్రవారంతో ముగియనుంది. సరిగ్గా 2022, మార్చి1వ తేదీన 16 మంది సభ్యులతో కూడిన ఆలయ ధర్మకర్తల మండలి కొలువుదీరింది. దాదాపు ఆరేళ్ళ అనంతరం ఎన్నో నాటకీయ పరిణామాల మధ్య మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ఒక్క రోజు ముందు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ 'మండలి'లో మొత్తం 16మందికి అప్పట్లో అవకాశం కల్పించారు. ఇందులో ఒకరు ఎక్స్ అఫిషియో సభ్యులు. ధర్మకర్తల మండలి అధ్యక్షులుగా అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులుగా జల్లి క్రిష్ణయ్య, ఎన్. జయశ్యామ్, సాధన మునస్వామి సి. ప్రకాశం పంతులు, పసల సుమతి, దాసరి జయమ్మ, ఎస్. లక్ష్మి, ఎం. రమాప్రభ, వి.చెంచులత, కొండూరు సునిత, ఎన్. మునిలక్ష్మి, పెద్దిరెడ్డి మల్లిఖార్జునరెడ్డి, కేసరి చిన్న సుబ్బారెడ్డి, ఎం. మహిధరెడ్డి, ఎక్స్ అఫిసియో సభ్యులుగా ఎస్ ఎం కే కష్ణమూర్తి గురుకుల్ ను అప్పట్లో నియమించారు. ధర్మకర్తల మండలిలో పెద్దిరెడ్డి మల్లిఖార్జునరెడ్డి, కేసరి చిన్నసుబ్బారెడ్డి, ఎం. మహిధర్ రెడ్డి స్థానికేతరులు. ఈ క్రమంలో సరిగ్గా మూడు రోజులకు ముందే ఈ పాలకమండలి పదవి కాలం ముగియడంతో మళ్లీ ఇదే కమిటీని కొనసాగిస్తారా..! లేక మండలి లేకుండానే ఉత్సవాలను జరిపిస్తారా అన్నది వేచి చూడాలి మరి.

పదవీకాలం పొడిగించే అవకాశం..? ఆశావాహులకు మొండిచేయేనా.. !

మళ్ళీ పొడిగించే అవకాశం!!

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వేళ ధర్మకర్తల మండలి ఉంటే బాగుంటుందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. ఆ ఉద్దేశ్యంతోనే వీరి పదవీకాలం పొడిగించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఈ నెల 27న శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి కలిశారు. ఇందుకు ముఖ్యమంత్రి జగన్ కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి పదవీకాలం పొడిగించాలని సంబంధిత శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారని సమాచారం. ఈ నేపథ్యంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యే లోపు ధర్మకర్తల మండలికి సంబంధించి దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయని ధర్మకర్తలి మండలి సభ్యుల్లో ఒకరు చెప్పారు. అదే జరిగితే ఈసారైనా ధర్మకర్తల మండలిలో చోటు దక్కించుకోవాలని ఎదురుచూస్తున్న పలువురు వైసిపి సీనియర్ కార్యకర్తల ఆశలకు గండి పడ్డట్లే. మొత్తానికి మూడో సారీ మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించే భాగ్యం తమ పాలక మండలికే ఉంటుందని తాజా మాజీలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



టిటిడి ఛైర్మన్‌ను సత్కరించిన ఉద్యోగులు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని ఆయన నివాసం వద్ద టిటిడి ఉద్యోగులు కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఇస్కాన్ రోడ్డు సమీపంలో టిటిడి ఉద్యోగుల కోసం ఇండోర్ స్టేడియం నిర్మాణానికి 7.50 కోట్లను మంజూరు చేస్తూ పాలకమండలిలో ఆమోదం తెలిపారు. టెన్నిస్, షటిల్, కారమ్స్, స్విమ్మిగ్‌పూల్, జిమ్, లాన్‌టెన్నిస్ క్రీడలు ఆడేందుకు వీలుగా టిటిడి ఇండోర్ స్టేడియం నిర్మించనుంది. యోగా హాలును అంతర్భాగంగా నిర్మించనున్నారు. ఉద్యోగులు తులసీ ప్రసాద్, వాసు, వెంకట రమణ, అనిల్, యశ్వంత్, క్రాంతి, వేణు, బాలాజీ పాల్గొన్నారు.

13న వాచీలు, మొబైల్ ఫోన్లు ఈ-వేలం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచీలు, మొబైల్ ఫోన్లను మార్చి 13న రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ- వేలం వేయనున్నారు. ఇందులో టైటాన్, క్యాషియో, టైమెక్స్, ఆల్విన్, సొనాట, టైమ్‌వెల్, ఫాస్ట్‌ట్రాక్, ర్యాడో కంపెనీల వాచీలున్నాయి. ఆదేవిధంగా ఐ ఫోన్లు, వివో, నోకియా, కార్బన్, శామ్సంగ్, మోటోరోలా, ఒప్పో కంపెనీల మొబైల్ ఫోన్లు వున్నాయి. కొత్తవి/ఉపయోగించిన/పాక్షికంగా దెబ్బతిన్న వాచీలు మొత్తం 23 లాట్లు, మొబైల్ ఫోన్లు 27 లాట్లు ఈ-వేలంలో ఉంచారు. ఇతర వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

లయన్స్ క్లబ్ ఆద్వర్యంలో విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

సూళ్లూరుపేట మండలంలో కుదిరి, కెసిఎన్ గుంట, దావాదిగుంట గ్రామాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో లయన్స్ క్లబ్ అఫ్ సూళ్లూరుపేట షార్ వారి ఆద్వర్యంలో విద్యార్థులకు స్టీల్ ప్లేట్ పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు పి.సుబ్రహ్మణ్యం రెడ్డి సహకారంతో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆదిశేషా రెడ్డి సారథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. క్లబ్ కార్యదర్శి శ్రీనివాసులు జెట్టి, ట్రెజరర్ అప్పారావు అద్వర్యంలో స్టీల్ ప్లేట్ పంపిణీ చేశారు.

పాఠశాల బాత్‌రూమ్‌లో నాగుపాము బుసలు

భయభ్రాంతులకు గురైన విద్యార్థులు

ప్రజాశక్తి - కోట

కోట మండలంలోని ఉత్తమ నెల్లూరు పంచాయతీ పరిధిలో ఉన్న తాటిగుంట చెరువు గిరిజన కాలనీ వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల బాత్ రూమ్‌లో నాగుపాము ప్రత్యక్షమైంది. గురువారం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సుజాత బాత్ రూమ్ షీట్‌లో నాగుపాము తల ఎత్తుకుని ఉండగా గుర్తించి ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. తక్షణమే గిరిజన విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారాన్ని తెలపగా వెంటనే తల్లిదండ్రులు వచ్చి ఆ పామును బయటకు పంపడంతో ప్రధానోపాధ్యాయురాలు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ నాడు-నేడు నిధుల ద్వారా భవన నిర్మాణ పనులు వేగవంతం చేస్తే ఇలాంటి సమస్యలు



లెట్రిన్ బేసిన్‌లో నాగుపాము

పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. ప్రస్తుతం ఉపయోగంలో ఉన్న పాఠశాల పూర్తిగా దెబ్బతిని శిధిలావ్యవస్థకు చేరుకుని ఉంది. ఈ నేపథ్యంలో ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు నిధులు మంజూరు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

1-10 తేదీల్లో ఆక్యుపంక్చర్ ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

డాక్టర్ బికె బసు 112వ జయంతి పురస్కరించుకుని మార్చి 1- 10 తేదీల్లో ఆక్యుపంక్చర్ ఉచిత వైద్యశిబిరాన్ని సమతా క్లినిక్ అధినేత డాక్టర్ ఎంఎస్ బాలాజీ ఆధ్వర్యంలో యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ప్రధాన కార్యదరి ఎం.నాగార్జున ఓ ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ జిల్లా జడ్జి గుర్రప్ప ప్రారంభిస్తారని, ప్రముఖ వైద్యులు డాక్టర్ మునస్వామి, డాక్టర్ శివశంకర్, డాక్టర్ జాలేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. దీర్ఘకాలికంగా తలనొప్పి, మెడ నొప్పి, వెన్నునొప్పి, నడుము నొప్పి, కాళ్ల నొప్పులు, సయాటికా, పక్షవాతం వంటి దీర్ఘకాలిక సమస్యలతో బాధపడే రోగులు ఈ వైద్య శిబిరాన్ని ఓ సదవకాశంగా వినియోగించు కోవచ్చని ఆయన విజ్ఞప్తి చేశారు.





ఉద్యోగ విరమణ పొందిన పోలీసులతో ఎస్పి

ఉద్యోగ విరమణ పోలీసు అధికారులకు సన్మానం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

పోలీసు విభాగంలో పలు పదవుల్లో బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఐదుగురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పి మల్లిక గర్గ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక పోలీసు అతిథిగృహంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె పదవీ విరమణ పొందిన సిఐ వై.బాలకృష్ణ, ఎస్ఐ వివి సుబ్బనాయుడు, ఏఎస్ఐ ఎస్.ఆనంద, ఏఆర్ఎస్ఐ జి.నాగేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ పివి.వెంకటేశ్వర రావులను సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం అంటేనే నిత్యం ఒత్తిడితో కూడుకున్న ఒక మహత్తర బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటరావు, ఏవో కిషోర్ కుమార్, ఎస్బి డిఎస్పి భాస్కర్ రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సభ చూసి జగన్ భయపడ్డాడు : కిరణ్‌రాయల్

ప్రజాశక్తి-తిరుపతి సిటి

టిడిపి, జనసేన సభకు లక్షలాది మంది తరలివచ్చారని, బుధవారం జరిగిన సభను చూసి ముఖ్యమంత్రి జగన్ భయపడ్డాడని జనసేన తిరుపతి నియోజకవర్గం ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ ఎద్దేవా చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసులను అడ్డం పెట్టుకుని తమ వాళ్లను చాలా చోట్ల అడ్డుకున్నారని, అయనా ప్రజలు తమ సత్తా చూపారన్నారు. ఈసారి ప్రజలు బటన్ నొక్కితే... రెండు దశాబ్దాల పాటు వైసీపీ కనిపించదని జోస్యం చెప్పారు. సిద్ధం సిద్ధం అని జగన్ బోర్డులు ఎక్కడ పెట్టాడో.. అక్కడ జగన్ పరారీ అనే బోర్డులు పెడతాం అన్నారు. ప్రజలు కొట్టే దెబ్బకు ఈసారి జగన్ అడ్రస్ గల్లంతు ఖాయమన్నారు.


నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభిస్తున్న టిటిడి ఛైర్మన్, ఈవోలు

శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో నిత్యాన్నదానం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి ఆలయం ఉత్తరమాడ వీధిలోని శ్రీ నమ్మాళ్వార్ సన్నిధి వద్ద నిత్యాన్నదానం కార్యక్రమాన్ని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి గురువారం ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తామని కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. ప్రతిరోజూ రెండువేల మంది భక్తులకు సరిపడేలా ఏర్పాటు చేశారు. తిరుమలలో లక్ష మంది నిత్యాన్నదాన పథకం ద్వారా భోజనం చేస్తున్నారు. తిరుచానూరులోనూ ప్రారంభించారు. త్వరలో ఒంటిమిట్టలోనూ చేపడతామని వెల్లడించారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఈ అన్నదాన కార్యక్రమం కొనసాగుతుంది. తన చిన్నతనంలో సాయంత్రం పూట గుడిలో అన్నప్రసాదం కోసం వచ్చిన సందర్భాలు పదుల సంఖ్యలో ఉన్నాయని గుర్తు చేశారు. అలాంటిది తాను నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

తిరుపతి టిక్కెట్ ఎవరికి..?

'యాదవ్'లకా... 'బలిజ'లకా..

వైసిపి నాయకురాలితో మంతనాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ నామినేషన్ ముందే అభ్యర్థిని ప్రకటించే సంస్కృతి టిడిపికి ఉంది. ఈసారి ఎన్నికల్లో జనసేనతో టిడిపి పొత్తు ఉన్నందున అభ్యర్థుల ప్రకటనలో సమన్వయంతో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలో జనసేన పోటీచేసే 24 స్థానాల్లోనూ తిరుపతి ఉండొచ్చన్న చర్చ నడుస్తోంది. అయితే టిడిపి మాత్రం సర్వేలో ఐదుగురు పేర్లను నియోజకవర్గ ఓటర్ల ముందు ఉంచింది. వారిలో మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, టిడిపి నాయకులు నరసింహయాదవ్, వూకా విజయ్‌కుమార్, జేబీ శ్రీనివాస్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం. వీరిలో నరసింహ యాదవ్ మాత్రమే యాదవ్ సామాజికవర్గం. మిగిలిన నలుగురూ బలిజ సామాజికవర్గం. తిరుపతి నియోజకవర్గంలో బలిజ తరువాత అంత పెద్ద ఓట్‌బ్యాంక్ బీసీలు, ముఖ్యంగా యాదవ్ కమ్యూనిటీవారు ఉన్నారు. జనసేన పొత్తు కుదిరినా కిరణ్‌రాయల్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పేర్లు వినిపిస్తున్నాయి. వీరిద్దరూ బలిజ సామాజికవర్గమే. చంద్రబాబు మాత్రం టిడిపికి దక్కితే 'యాదవ్' కులస్తులకు ఇస్తారని చర్చ నడుస్తోంది. వైసిపిలో కీలకంగా ఉన్న ఓ మహిళా ప్రజాప్రతినిధితో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఆమె 'ఊ' అంటే 'యాదవ్'లకు. 'ఊహూ' అంటే బలిజలకు. గతంలోనూ టిక్కెట్ ప్రకటించేటపుడు చదలవాడ క్రిష్ణమూర్తికిగాని, ఎన్‌వి ప్రసాద్‌కు గాని, వెంకటరమణకు గాని నామినేషన్‌కు ఒకట్రెండు రోజుల ముందే టిడిపి అభ్యర్థులను ప్రకటించింది. తిరుపతిలో గెలిస్తే రాష్ట్రవ్యాప్తంగా అధికారం వస్తుందని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుకు సెంటిమెంట్. ఈ నేపథ్యంలో ఆచితూచి అడుగులేయడం చంద్రబాబు వ్యూహం.

టిడిపికి అశోకరాజు రాజీనామా.....

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



తెలుగుదేశం పార్టీకి 1983 నుండి విధేయునిగా కష్టించానని, పలుమార్లు నగరి నియోజకవర్గ అభ్యర్థిత్వాన్ని ఇస్తానని ఆశ చూపిన అధిష్టానం ఈసారీ ప్రజా వ్యతిరేకత ఉన్న గాలి భానుప్రకాష్‌కే టికెట్టు కట్టబెట్టడంతో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన కార్యనిర్వాహక కార్యదర్శి బాధ్యతకు రాజీనామా చేస్తున్నానని పుత్తూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కొండూరు అశోక రాజు ప్రకటించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘవిద్రోహ చర్యలతో, స్మగ్లింగ్ చేసేవారితో సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తి భాను గురించి నగరిలో ఉన్న ప్రజలకు తెలుసన్నారు. ఏ పార్టీలో చేరేది వారంలో స్పష్టం చేస్తానన్నారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచన పుత్తూరు పాఠశాలను గురువారం ఎంఈవో సుబ్రమణ్యం పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. హెచ్ఎం లీలాప్రసాద్ పాల్గొన్నారు.

పజిల్ పోటీలు

ప్రజాశక్తి-తిరుపతిసిటీ: పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంపై 70 మంది విద్యార్థులకు పజిల్ పోటీలు నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజరు సుభాష్, కళాశాల ప్రిన్సిపల్ మోహిదీన్‌బాషాలు కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని తెలియజేశారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

పలు సమస్యలపై చర్చ

ప్రజాశక్తి-గూడూరుటౌన్: పలు సమస్యలపై మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించారు. ఎంపీపీ గురవయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. వైస్ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, జెడ్పీటీసీ యామిని, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో షాలి, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక తులసి పూజ

ప్రజాశక్తి-గూడూరుటౌన్: పట్టణంలోని బాలాజీ నగర్‌లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం విశేష పూజలు జరిగాయి. సామూహిక లక్ష తులసి పూజ పూర్ణాహుతి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉభయకర్తలుగా చంద్రశేఖర్‌రాజు, మురళీమోహన్ రాజు, వాసుదేవరాజు, దాతలు శివకుమార్‌రెడ్డి, దేవసేనమ్మ కుటుంబ సభ్యుల వ్యవహరించారు.

అంగరంగ వైభవంగా కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు


ప్రజాశక్తి - రామచంద్రాపురం(చంద్రగిరి): శ్రీనివాస మంగాపురం శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో గురువారం ధ్వజారోహణ ఘట్టంతో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం య్యాయి. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

విస్తృత ఏర్పాట్లు: జేఈవో

జేఈవో వీరబ్రహ్మం మీడియాతో మాట్లాడుతూ, కళ్యాణ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 29 నుండి మార్చి 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తుల కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టామన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాలను భక్తులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 4న



గొడుగులు వితరణ చేస్తున్న దాతలు



విశేష అలంకరణలో శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి

గరుడసేవ, 8న స్వర్ణరథోత్సవం, 7న రథోత్సవం, 8న చక్రస్నానం జరుగనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వాహనసేవలు వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు.

రెండు గొడుగులు విరాళం

తమిళనాడులోని తిరునిన్రవూరుకు చెందిన శ్రీవేద్ రామానుజ కైంకర్య ట్రస్ట్ ప్రతినిధులు రెండు గొడుగులను కానుకగా జేఈవో వీరబ్రహ్మంకు అందించారు. ఆలయ ప్రత్యేకశ్రేణి, సిఐఆర్వో డా.టి.రవి, ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, వైఖానస ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి వలస కార్మికురాలు మృతి

- ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-రేణిగుంట: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కి గురై వలస కార్మికురాలు మృతి చెందిన సంఘటన గురువారం స్థానిక వినాయకనగర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా నుంచి వలస వచ్చిన సింహాచలం, అతని భార్య స్వాతి(35) దంపతులు తన ఇద్దరు కుమారులతో కలిసి రేణిగుంట బుగ్గవీధిలో కాపురం ఉంటున్నారు. రోజు వారి తాపీ వద్ద కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం వినాయక నగర్‌లోని ఓ భవన నిర్మాణ పనుల్లో భాగంగా ఇనుప కమ్మిని మెట్లమార్గంలో తీసుకెళుతుండగా ప్రమాదవశాత్తు ఆ కమ్మి 11కేవీ తీగకు



తగిలింది. దీంతో షాక్‌కు గురైన స్వాతిని గుర్తించిన అక్కడి తోటి కార్మికులు 108ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. అప్పటికే స్వాతి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాధితురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, కార్యదర్శి హరినాథ్ ప్రతికా ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-గూడూరురూరల్: మండలంలోని విందూరు గిరిజన కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నేరెళ్ల వెంకట సుబ్బారావు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది,



ఎంఈవోలు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఎంఈవోలు సనత్‌కుమార్, కాంచనలు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది వారి ఉన్నతకి సహకరించిన వెంకట సుబ్బారావు సేవలు వెలకట్టలేనిమన్నారు. కార్యక్రమంలో విందూరు మాజీ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాండిచ్చేరి బీచ్‌లో విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి-నారాయణవనం: మండలంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లమా విద్యార్థి గల్లంతైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కళాశాలకు చెందిన ఓ అధ్యాపకుడు, ఆయన కుటుంబ సభ్యులతో కలిసి 19మంది విద్యార్థులు మంగళవారం విహారయాత్రకు ఓ ట్రావెల్స్ బస్సులో పాండిచ్చేరి బీచ్‌కు వెళ్లారు. బీచ్‌లో తోటి స్నేహితులతో కలిసి స్నానం చేస్తుండగా అకస్మాత్తుగా వచ్చిన అలల్లో ప్రమాదవశాత్తు లోతైన ప్రదేశానికి వెళ్లిపోయాడు. గుర్తించిన తోటి స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో అక్కడి పోలీసులను ఆశ్రయించారు. బీచ్‌లోకి గజ ఈతగాళ్ల సాయంతో విద్యార్థి మృతదేహాన్ని వెలికితీయించినట్లు సమాచారం.

ఇంకెంతకాలం తిరగాలయ్యా..!

- పట్టా పుస్తకాలు మంజూరు చేయలేదని నిరసన

ప్రజాశక్తి-బాలాయపల్లి: 30ఏళ్లుగా తిరిగి తిరిగి కాళ్ళు అరిగాయే తప్ప పాసుపుస్తకాలు చేతికిరాలేదు.. ఇంకెంత కాలం తిరగాలయ్యా అంటూ బాధితురాలు సుబ్బమ్మ, మార్పు సంస్థ వ్యవస్థాపకులు చిగురుపాటి పవన్ గురువారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట మెట్లపై కూర్చొని నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని భైరవరం గ్రామానికి చెందిన కడిమి సుబ్బమ్మ 35ఏళ్లకు ముందు కోవూరువారిగుంట సర్వే నెంబర్ 96లో 3ఎకరాల భూమిని కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఆ భూమికి సంబంధించి పాసుపుస్తకం కోసం 30సంవత్సరాలుగా తహశీల్దార్, గూడూరు ఆర్‌డీవో, నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదరాలైన సుబ్బమ్మను ఇలా తిప్పించుకోవడం అధికారులకు తగదని పలువురు మండిపడ్డారు. జగనన్న అధికారులు స్పందించి పట్టా పాసుపుస్తకం ఇవ్వాలని ప్రజాసంఘ నాయకులు కోరారు.

అభివృద్ధికి తపనపడే టీడీపీని గెలిపించండి: వినీల్



ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): రాష్ట్ర అభివృద్ధి కోసం తపనపడే టీడీపీని ఆదరించి గెలిపించాలని టీడీపీ చంద్రగిరి ఇన్‌ఛార్జ్ పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ అన్నారు. గురువారం చంద్రగిరి మండలం రామిరెడ్డిగారిపల్లె పంచాయతీ బందార్ల పల్లిలో 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని', 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ఇంటి ఇంటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నానికి ఒక అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశమివ్వండి..

ప్రజాశక్తి-గూడూరుటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గూడూరు అసెంబ్లీ, తిరుపతి ఎంపీ స్థానాల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ తరపున అవకాశమివ్వాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యునైటెడ్ ఫోరం జాతీయ అధ్యక్షులు డేగా రవి రాఘవేంద్ర కోరారు. గురువారం విజయవాడ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఇన్‌ఛార్జ్‌కు దరఖాస్తులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గూడూరు, తిరుపతి ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఫోరం ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇవ్వకుంటే స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తానన్నారు.

కూటమి గెలుపు తథ్యం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి గెలుపు తథ్యమని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాడేపల్లి గూడెంలో నిర్వహించిన తెలుగు జన సభకు వచ్చిన ప్రజల స్పందన చూసి జగన్ గుండెల్లో గుబులు మొదలైందన్నారు. టీడీపీ-జనసేన కలయిక పార్టీల కోసం కాదనీ, ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల కోసమని అన్నారు. రాబోయే ఎన్నికలు ఈ రాష్ట్రానికి అత్యంత కీలకమనీ, ప్రజలందరూ టీడీపీ-జనసేన కూటమిని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు, వైసీపీ నాయకులకు వ్యతిరేకంగా టీడీపీ-జనసేన పోరాడుతున్నాయని, దానికి ప్రజలందరూ మద్దతు తెలపాలని కోరారు. ఉచిత ఇసుక ఇస్తాననీ, మద్యపానం నిషేధిస్తానని మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన మోసగాడు జగన్మోహన్ రెడ్డిని ఓడించడానికి ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

రూ.39లక్షలతో శ్మశాన వాటిక ఆధునీకరణ



ప్రజాశక్తి-తిరుపతిటౌన్: కార్పొరేషన్ పరిధిలోని వివి మహల్ రోడ్డు వద్దనున్న ముస్లింల శ్మశానవాటికలో రూ.39లక్షలతో ఆధునీకరణ పనులు చేపట్టారు. అవసరమైన షెడ్లు, ఫేవర్స్, ఆర్చ్, కాంపౌండ్ వాల్ నిర్మించారు. కాగా గురువారం నగర మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, కమిషనర్ అదితి సింగ్ చేతుల మీగా ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వంలో ముస్లింలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నట్లు మేయర్, డిప్యూటీ మేయర్‌లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.బాబు, మునిసిపల్ కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహేబ్, ఖాదర్ భాష, కార్పొరేటర్ నరేంద్ర, ఎస్‌ఈ మోహన్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, డిఈ విజయకుమార్‌రెడ్డి, నాయకులు హాజి ఫరీద్, మౌలానా ఇబ్రహీమ్ హాస్మీ, ముస్తీ సమీవుల్లా, ఏటిజే మాళిక్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ చోటూ బాయ్, చానూ బాయ్, దినేష్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

నెలవల విజయశ్రీకి ఘన స్వాగతం

ప్రజాశక్తి - పెళ్లకూరు: మండలంలోని టీడీపీ మండల అధ్యక్షులు కృష్ణయ్య ఆధ్వర్యంలో గురువారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయశ్రీ పరిచయ కార్యక్రమం జరిగింది. కార్యక్ర మానికి విచ్చేసిన ఆమెకు పలువురు ఘన స్వాగతం పలికారు. తాళ్ళాపా గ్రామం వద్ద గోమతి సర్కిల్ నుండి కొత్తూరు గ్రామం వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు విజయభాస్కర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు ఎల్లవేళలా అన్ని రంగాల్లో సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు, పెళ్లకూరు మండలం నుంచి అత్యధిక మెజారిటీ నిచ్చి ఆదర్శంగా నిలిచి అత్యధిక మెజారిటీతో గెలిపించి చంద్రబాబు నాయుడుకి బహుమతిగా ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో 24పంచాయతీల్లో ఉన్న టిడిపి నాయకులు పరిచయం చేస్తూ ఆమెకు ఘనవిజయాన్ని ఇస్తామంటూ భరోసా ఇచ్చారు.

'అభివృద్ధికే ఓటు వేయాలి'

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతిలో జరిగిన అభివృద్ధికి ఓటు వేయాలని వైసీపి విద్యార్థి విభాగం ఎస్వీయూ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్ అన్నారు. గురవారం ఎస్వీయూ వద్ద 'నా మొదటి ఓటు అభినయ్ అన్నకే' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వైసీపీ యువనాయకులు పసుపులేటి సురేష్, ఉదయ్ వంశి, వాసుయాదవ్, అరుణ్‌యాదవ్‌లు పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. తిరుపతిని అభివృద్ధి చేస్తున్న వచ్చే ఎన్నికల్లో భూమన అభినయ్‌ని గెలిపించుకోవడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి నాయకులు పసుపులేటి వినయ్, అనిల్‌రెడ్డి, నాగరాజు, ముని, నరేష్, నాగేంద్ర, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా

ధనుంజయలు నాయుడు



ప్రజాశక్తి-తిరుపతిటౌన్: ఎస్‌టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా కే. ధనంజయలు నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాల, సంజయ్ గాంధీ కాలనీలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆయన రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికైన సందర్భంగా ఆ పాఠశాల ఆవరణలో నాయకులు ఆయనను కలిసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. నాయకులు మునికృష్ణనాయుడు, జగన్నాథం, మురళీకృష్ణ, రేణుకా దేవి, రమేష్ నాయక్, శ్రీనివాసన్, మనోహర్, అనిల్‌కుమార్, జయప్రకాష్ పాల్గొన్నారు.

పెళ్లికానుక అందజేత

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన సొంత నిధులతో నియోజకవర్గంలోని నూతన వధూవరులకు పెళ్లికానుకను అందజేస్తున్నారు. గురువారం మండలంలోని తిప్పిరెడ్డిగారిపల్లి పంచాయతీలో ఉంటున్న కుసుమంత్, కృష్ణవేణిలకు పెద్దలు వివాహం నిశ్చయించారు. వీరికి ఎమ్మెల్యే పంపించిన కానుకను సర్పంచ్ మాధవి, నాయకులు మాజీ ఎంపీటీసీ భూషణ, గ్రామపెద్దల చేతుల మీదుగా అందజేశారు.

'ఎంజీఎం'లో ఘనంగా సైన్స్‌డే

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: సైన్స్ డే పురస్కరించుకొని గురువారం స్థానిక బైరాగిపట్టెడలోని ఎంజీఎం పాఠశాలలో విద్యార్థులు నమూనాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను హెచ్‌ఎం మురుగన్ అభినందించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు భాస్కర్, అరుణశ్రీ, తులసిప్రకాష్, సుధారాణి, చాముండేశ్వరి, రవి, ప్రసన్నలక్ష్మి, హేమాద్రిబాబు, శోభ తదితరులు పాల్గొన్నారు.

రమణయ్యకి నివాళి

ప్రజాశక్తి-కోట: మండలంలోని దళిత వాడకు చెందిన టీడీపీ కార్యకర్త పనబాక రమణయ్య అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం విషయం తెలుసుకున్న తిరుపతి పార్లమెంట్ బీసీ సెల్ నాయకులు తీగల సురేష్‌బాబు, నాయకులు సురేష్‌లు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేసి ధైర్యం చెప్పారు.

వైసీపీకి పలువురి రాజీనామా

ప్రజాశక్తి-గూడూరుటౌన్: పురపాలక పరిధిలోని చెన్నూరు మేజర్ పంచాయతీలోని వైసీపీకి చెందిన పలువురు నాయకులు గురువారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. త్వరలో టీడీపీలో చేరుతామని వారు స్పష్టం చేశారు. గురువారం మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ వారితో చర్చించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మురళి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా కక్షిదారు కోడూరు హరికృష్ణ, తండ్రి నారాయణ రావు గారు గూడూరు టౌన్, సొసైటీ కాలనీ, కాపురస్తురాలు ఈదల చంద్రకళ, భర్త శ్రీనివాసరావు వారి వద్ద ఈక్రింది షెడ్యూలు దాఖల ఆస్థిని తేది : 26.02.2024 విక్రయ అగ్రిమెంట్ ద్వారా కొనుగోలు చేసియున్నారు. కావున సదరు ఆస్తి కొనుగోలు విషయమై ఎవరికైన ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన అందిన 10 రోజులు లోపల ఆక్షేపణలు తెలుపుకోవలసినది.

షెడ్యూలు

తిరుపతి జిల్లా, గూడూరు సబ్-రిజిస్ట్రేషన్, గూడూరు మండల తిప్పవరప్పాడు గ్రామ పంచాయతీ ఏరియా, చెన్నూరు బిట్-1, కోరుమిట్ట భూమి

పట్టా నెం.	సర్వే నెం.	విస్తీర్ణం
1245	970-2	య.0-79
	971	య.3-57
	972-ఎ	య.0-29
	972-బి1-బి	య.0-25
	972-బి2	య.0-13
	972-బి3	య.0-33
	973	య.1-40
	మొత్తం	**య.6-76**

హద్దులు: తూర్పు-కాలువ, దక్షిణం-కాలువ, పడమర-నెల్లూరు శ్రీనివాసులు రెడ్డి గారి భూమి, ఉత్తరం - రోడ్డు.

ఇట్లు
జి.దినకర్ రెడ్డి
న్యాయవాది, గూడూరు

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


ప్రజాశక్తి-తిరుపతిటౌన్: నగరంలోని శ్రీ సాయిసుధా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక తిలక్‌రోడ్డులోని ఆసుపత్రి వద్ద డాక్టర్లు 50మందికి కంటి పరీక్షలు చేశారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ మధుమేహం ఉన్న వారిలో డయాబెటిక్ రెటినోపతి అనే కంటి వ్యాధి వస్తుంది ఇలాంటప్పుడు రక్తంలో చెక్కర స్థాయిలు రెటీనాలోని రక్తనాళాలను దెబ్బతీస్తాయి. రెటీనా అనేది కంటి లోపల భాగంలో కాంతి సెన్సిటివ్ భాగం అన్నారు. డయాబెటిక్ రెటీనోపతి యొక్క ప్రారంభ దశలో దృష్టి సాధారణంగా ప్రభావితం కాదు రెటీనో పతి అభివృద్ధి చెందుతున్నప్పుడు దృష్టి ప్రభావితం కావచ్చు పరిస్థితిని చాలా కాలం పాటు నిర్లక్ష్యం చేస్తే పూర్తిగా దృష్టిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.



డయాబెటిస్ ఉన్నవారు ప్రతి 3నెలలకు ఒకసారి తప్పనిసరిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నట్లయితే, మధుమేహ వ్యాధిని అదుపులో ఉంచుకున్నట్లయితే డయాబెటిక్ రెటీనోపతి బారిన పడకుండా, కంటి చూపు కోల్పోకుండా కాపాడుకోవచ్చని ఆమె తెలియజేశారు. శిబిరంలో హాస్పటల్ సిబ్బంది హిమబిందు, గీత, సునీత, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ రోడ్డుతో ట్రాఫిక్ కష్టాలకు చెక్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శివం-శివం రోడ్డు పూర్తయితే శ్రీకాళహస్తి పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తొలగిపోతాయని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన రూ.29 కోట్ల వ్యయంతో చేపట్టనున్న శివం-శివం రోడ్డు నిర్మాణానికి భూమి



పూజ చేశారు. అంతేకాకుండా రూ. 4.50కోట్ల వ్యయంతో తలపెట్టిన స్వర్ణ ముఖి నది ఎడమవైపు కట్ట సుందరీకరణ పనులకు, రూ. 3.20కోట్లతో తలపెట్టిన కనకదుర్గమ్మ ఆలయం అభివృద్ధి విస్తరణ పనులకు కూడా ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ నాన్ లోకల్ నాయకులకు ఓటు వేస్తే ప్రజలకు నామాలు పెట్టి వెళ్లిపోతారంటూ పరోక్షంగా బొజ్జల సుధీర్ రెడ్డిపై విమర్శలు చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కరోనాకు రెండేళ్లు పోను మిగిలిన మూడేళ్లలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజలు గమనించాలని సూచించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఏపీఎస్‌ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మిద్దెల హరి తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి: పీడీ శ్రీనివాస్ ప్రసాద్



ప్రజాశక్తి-ఏర్పేడు: ఉపాధిహామీ పథకంకి సంబంధించిన రికార్డులు పక్కాగా నిర్వహించాలని డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని అముడూరు, పొంగూరు సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీలకు సంబంధించి మస్టర్ కార్డులు, వాటిలోకి సంతకాలు, పేమెంట్ స్లిప్పులు, జాబ్‌కార్డులను ఎప్పటికప్పుడు పక్కాగా అప్డేట్ చేయాలన్నారు. అదేవిధంగా మండల తీర్మాణాలు, రెవెన్యూ రికవరి వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. వీలైనంత ఎక్కువ మందికి ఉపాధి కల్పించేందుకు ప్రయత్నించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఉద్యాన పంటలకు ఉపాధి హామీ ద్వారా కల్పిస్తున్న పనులపై అవగాహన కల్పించి పండ్ల తోట పెంపకంపై రైతులకు తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖం రాజు, అవిలాల దేవరి, పాండజా, బాలాజీ రావు, మనోహర్, వెంకటాద్రి, రవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్నాం: భాను

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: వైసీపీ చేస్తున్న అరాచకాలు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్నామని టీడీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాడేపల్లిలో బుధవారం నిర్వహించిన జనసేన, టీడీపి ఉమ్మడి సభకు విచ్చేసిన జన సముద్రాన్ని చూసి సీఎం జగన్ వనికిపోతున్నారని ఆయన అన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు చెర్లోపల్లికి చెందిన వైసీపీ నాయకులు లోకనాథరెడ్డి, గజేంద్ర, మునికృష్ణ, కుప్పయ్య,



పలువురిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గాలిభాను

నరసింహులు, రామదాసు, నాగభూషణం, ప్రవీణ్‌కుమార్‌లు టీడీపీలో చేరారు. వారికి గాలి భాను టీడీపీ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు.

బ్యాంకు పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-పిచ్చాటూరు: మండలంలోని అప్పంబట్టు, కొప్పేడు, నీరువాయి గ్రామాల్లో ఎం.వి రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత వారు బ్యాంకు పథకాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. బ్యాంకు స్కీమ్స్‌పై ముఖ్యంగా సామాజిక భద్రత పథకాలు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన అటల్ పెన్షన్ యోజన జీరో అకౌంట్ నగతురహిత లావాదేవీలు సైబర్ మోసాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ అంజద్ ఆలీ, క్యాషియర్ జి.సుకుమార్, బ్యాంకు సిబ్బంది కళాజాత బృందం సభ్యులు వినోద్, చిరంజీవి, విజయ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ఫ్లెక్సీ బాధిత కుటుంబానికి గురువారం మంత్రి రోజ సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందచేశారు. పట్టణంలో ఇటీవల వాసు అనే ఫ్యాక్టరీ కార్మికుని ఇంటి మీద ఫ్లెక్సీ పడి, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో గృహోపకరణాలు దగ్ధం అయ్యాయి. దీనిపై స్పందించిన రాంప్రసాద్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులు వాసు, జ్యోతిలక్ష్మిలకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.20వేలు సాయాన్ని అందజేశారు.

మహారాజశ్రీ గౌరవ ప్రధాన సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), రాజంపేట
I.A.No.141/2023 in I.A.142/2023
In O.S.No. 167/2016

Between:
బొజ్జిరెడ్డి శేషారెడ్డి.
...పిటిషనర్/వాది
Vs
గట్టు సుబ్బారెడ్డి మరియు Others.
...రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

R2. గట్టు బలరామక్రిష్ణారెడ్డి Died
His LRs R7.శ్రీమతి చొప్పా పద్మావతమ్మ, W/o రమణారెడ్డి, నాగవరం (గ్రా॥), చిట్వేలి (మం॥).
R8.శ్రీమతి చల్లా సుభద్రాదేవి, W/o శ్రీపతిరెడ్డి, నివాసము డోర్‌నెం.309, రాదేశం రెసిడెన్సీ, కరకంబాడి రోడ్డు, తిరుపతి (Post, M, Dt)

నోటీసు

పై చెప్పిన దావాలో R2 మరణించినందున అతని LRs గా, R7,R8లను బాధ్యులుగా చేర్చినారు. సదరు కేసు 22.03.2024వ తేదీ ఉ॥10.30 గం॥లు పై కోర్టులో పై చెప్పిన కేసు వాయిదా ఉన్నది. కావున మీరు స్వయముగా కాని, వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట మీ పరోక్షమున ఉన్న కేసు రికార్డులను పరిశీలించి కోర్టు ఉత్తర్వులను పాలించబడునని ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

//By Order of the Court//
ఎ.వెంకటసుబ్బయ్య, B.Sc., B.A., B.L.,
అడ్వకేట్ & నోటరి,
రాజంపేట. సెల్: 9030543803.

పద్మావతి వర్సిటీలో నౌషీన్ అలీ సందర్శన

ప్రజాశక్తి-క్యాంపస్: ఎంఎస్ నౌషీన్ అలీ, ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ ఎడ్యుకేషన్ ఔట్‌రీచ్ కోఆర్డినేటర్, పబ్లిక్ డిప్లొమసీ విభాగం యు.ఎస్ కాన్సులేట్, హైదరాబాద్, వైస్ ఛాన్సలర్ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డి భారతి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని, సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ బృందంతో యు.ఎస్.ఎలోని విశ్వవిద్యాలయాలలో చదువుకోవడానికి అధ్యాపకులు, విద్యార్థులకు నిధుల అవకాశాలు, వారి గురించి పంచుకున్నారు. ఉపాధ్యాయులు మరియు భాషా సాహిత్య పరిశోధకులకు పాఠ్యాంశాలను మెరుగుపరచడం, ఆంగ్ల అభివృద్ధిని సులభతరం చేసే ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీతో ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఫెలో ప్రోగ్రామ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్పెషలిస్ట్ ప్రోగ్రామ్ గురించి కూడా ఆమె చర్చించారు. ప్రొఫెసర్ భారతి, వైస్ ఛాన్సలర్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ అవకాశాలను అందించడం, భాషా నైపుణ్యాలను మెరుగుపరచడం, అధ్యాపకులు, విద్యార్థులకు ప్రపంచవ్యాప్త బహిర్గతం చేయడానికి యు.ఎస్.ఎ లోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలతో విశ్వవిద్యాలయాన్ని అనుసంధానించడంలో తన ఆసక్తిని పంచుకున్నారు.

ఉపాధి కల్పించేవారికే ఓటేయండి : రవి నాయుడు

తిరుపతి (మంగళం) : రాబోవు ఎన్నికల్లో ఉపాధి కల్పించే కంపెనీలను తీసుకువచ్చే వారికే మొట్టమొదట ఓటు అర్హత పొందిన యువత ఓటు వేయాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు పిలుపునిచ్చారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి క్యాబినెట్ లోని మంత్రులు రాష్ట్రానికి కంపెనీలు తీసుకొచ్చాము అని ఉదరగొడుతుంటే... ఏ కంపెనీలని పరిశీలిస్తే నకిలీ మద్యం కంపెనీలను తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. వైసీపీ హయంలో మార్కెట్లోకి విడుదలైన మద్యం బ్రాండ్లను చూపుతూ విమర్శలు చేశారు. నిరుద్యోగులు ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం వైపు ఆశగా ఎదురు చూస్తుంటే ఉపాధి అవకాశాలు కల్పించడం పోయి యువతను మద్యం మత్తులో తోగడానికి నాసిరకం మద్యాన్ని వైసీపీ సర్కార్ విక్రయించడం దారుణం అన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి యూనివర్సిటీలో రెండు రోజుల పాటు జరగనున్న కల్చరల్ ఫెస్ట్‌కు సంబంధించి పోస్టర్లను వీసీ భారతి గురువారం ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనాలని తమ ప్రతిభను చూపించాలని ఆమె తెలిపారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో

దేశం గణనీయమైన పురోగతి: డీఆర్‌డీవో మాజీ చైర్మన్

ప్రజాశక్తి-క్యాంపస్: ఏబీఆర్ ఎస్ఎం, వాయిస్ ఆఫ్ తిరుపతి అకడమిషియన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్వీయూలోని సెనేట్ హాలులో నిర్వహించిన ఆత్మనిర్భర భారత్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై నిర్వహించిన చర్చా వేదికలో ముఖ్య వక్తగా డిఆర్డిఓ మాజీ చైర్మన్, రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్ రెడ్డి, సభాధ్యక్షులుగా ఎస్వీయూ ఉపకులపతి ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి, అతిథులుగా ఏబిఆర్ఎస్ఎం జాతీయ సహ సంఘటన కార్యదర్శి గుంత లక్ష్మణ్, ఏబిఆర్ఎస్ఎమ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ సి.వాణి, వాయిస్ ఆఫ్ తిరుపతి అకడమిషియన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజశేఖర్ పాల్గొన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం గణనీయమైన పురోగతి సాధించిందని డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: భారత రాజ్యాంగంలో పిల్లలకు కల్పించిన చట్టాలపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవా అధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం చిత్తూరు మండల విద్యాశాఖ అధికారి సెల్వరాజ్, ప్రిన్సిపాల్ సాగరికలతో కలిసి పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్‌లో 7వ తరగతి మరియు 8 వ తరగతి చదివే విద్యార్థులకు చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పిల్లలకు కల్పించిన చట్టాలపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌కు సంబంధించి ఉపాధ్యాయులు విద్యార్థులు వివరించాలన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుండి మంచి అలవాట్లు అలవాటు చేసుకోవాలని అప్పుడే వారు ఉన్నతస్థాయికి వెళ్ళడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థి దశ నుండి సమాజంలో జరుగుతున్న పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మంచికి దగ్గరగాను చెడుకు దూరంగా విద్యార్థులు ఉండాలని సూచించారు. అనంతరం ఇటీవల నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో విజేతలకు మెమెంటోస్, మెరిట్ సర్టిఫికెట్స్‌ను జడ్జి విద్యార్థులకు అందజేశారు.

'గురుకుల' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-సదుం: మండల పరిధిలోని మహాత్మా జ్యోతిబాయి పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ మీడియంలో చదువుటకు విద్యార్థులు ధరఖాస్తులు చేసుకోవాలని సదుం బిసి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసులు రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు దరఖాస్తులు ఎంజెపిఏపిబిసి డబ్ల్యూఆర్ఈఐఎస్.ఏపి సిఎఫ్ఎస్ఎస్. ఇన్ వెబ్‌సైట్ ద్వారా మార్చి 1 నుంచి 31వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

హత్య కేసులో నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఫిబ్రవరి 25న ఆదివారం పట్టపగలే శ్రీనివాస మంగాపురం- కాలూరు మధ్య ప్రధాన రహదారి లోనే బాల చంద్రశేఖర్ రెడ్డి హత్య జరిగిన విషయం విదితమే. ఈ కేసులో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తిరుపతి రూరల్ పోలీసులు తెలిపారు. పాత కక్షల వల్లే తోడబుట్టిన అన్న తమ్ముడిని హత్య చేసినట్లు తిరుపతి రూరల్ పోలీసులు తేల్చారు. చంద్రశేఖర్ రెడ్డి తన కుమారులను ఆదివారం నారాయణ స్కూల్ వద్ద కలిసి వస్తుండగా దారిలో అటకాయించి అతి దారుణంగా హత్య చేసిన కేసులో తిరుపతి బొమ్మగుంట లో నివాసం ఉంటున్న రామ్మోహన్ రెడ్డి ప్రధాన నిందితుడు, రౌడీ షీటర్ పురుషోత్తం రెడ్డి. యోగి, చింతకాయల వీధికి చెందిన మైనర్ బాలుడుని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తమీమ్ అహ్మద్ తెలిపారు. గతంలోనూ నేరాలకు పాల్పడిన వీరిపై కేసులు ఉన్నా యని, నిందితులను రిమాండుకు తరలించామని వెల్లడించారు.

IN THE COURT OF THE PRINCIPLE SENIOR CIVIL Judge : TIRUPATI
O.E.P.No 57/2019 , O.S.N0:199/2016

V.S. Govinda Rajulu s/o Late. V.S.Seethuram, D.No. 10-49, K.V. Nagar, yogimallavaram, Tiruchanoor post, Tirupati Rural Mandal ...DHr
Vs
Vemula Venkataramana Gupta S/o late Vemula Venugopal Chetty, D.No.8-1-183, Bazaar street, Tirupati, and D.no.200, VaradarajaNagar, K.T.Road, Tirupati. ...JDr

Aution Notice

The Decree holder attached the schedule mentioned property the building bearing door No 8-1-183 Bazaar street, Tirupati and bring to the public auction and the property will be sold by the court in the public action on 15-3-2024 in above public court at 10-30 A.M The bidders may be participate in public court and auction will be conducted by the court as per the rules and conditions of the court.

SCHEDULE OF PROPERTY: Chittoor District, now Tirupati District, Sri Balaji Registration District, Tirupati Sub-District, Tirupati Urban Mandal, Tirupati Municipal area, now Tirupati Municipal Corporation - Bazaar Street, T.S.No.2285, RCC Building bearing D.No.8-1-183, New number 9-23-M18-176, bounded on: **East:** Komati Sandhu, **West :** Bazaar Street, **North:** House bearing No.8-1-182 belongs to Peddabba; South : House bearing No.8-1-185 belongs to Jayaramulu; within this boundaries Ground floor, 1st floor, RCC Building with doors and electrical service connection, Municipal tap connection, measuring East to West : 65 ft., and North to South :6 ft, with stair case to 1st floor with all the amenities attached to the building with ingress and outgress into the road.

Decree Holder 's Value Rs 5,00,000-00
Amis value Rs 27,00,000-00
Sub-registrors value Rs29,95,895-00 E.C. NIL.

Auction Date:15-3-2024 at 10-30 A.M.
KESARLA CHANDRA SEKHAR
G.MADHUSUDANA REDDY,
Advocates for Decree Holder,Tirupati.